పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

మల్లాపూర్, ఏప్రిల్ 2: పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి అన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన సన్న బియ్యం పథకాన్ని బుధవారం కుషాయిగూడలోని అన్న పూర్ణ ఏస్టేట్ వద్ద గంపకృష్ణ రేషన్‌షాప్ వద్ద సన్న బియ్యం పథకాన్ని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఉప్పల్: నాచారం డివిజన్ పరిధిలోని సాధన మానసిక వికలాంగుల ఇనిస్టిట్యూట్‌లో వరల్డ్ అటి జం డే కార్యక్రమం బుధవారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే బండారి లక్ష్మా రెడ్డి హాజరైనారు.కార్యక్రమంలో పార్టీ గ్రేటర్ నా యకులు సాయి జెన్ శేఖర్, ఫౌండర్ రాజు, డివిజన్ కార్పొరేటర్ దేవేందర్ రెడ్డి, పార్టీ నాయకులు ప్రవీణ్ ముదిరాజ్, నాగేశ్వర్ రావు, గోపాల్ రెడ్డి, సురేఖ రెడ్డి, కార్యదర్శి మధు సుధన్ రెడ్డి, విద్యార్థులు,ఆశవర్కర్లు పాల్గొన్నారు.

'ప్లీనరీ పోస్టర్' ఆవిష్కరణ

కాప్రా: సికింద్రాబాద్ నియోజకవర్గంలో నిర్వహించే తెలంగాణ ఉద్యమకారుల ప్లీనరీ సమావేశానికి సంబంధించిన పోస్టర్‌ను సైనిక్ పురి లోని ఎమ్మెల్యే నివాసంలో బుధవారం ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఫోరమ్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ చీమ శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి పట్లోళ్ల సురేందర్ రెడ్డి, కొండ స్వామి, తాడూరి గగన్ కుమార్, జానకి రెడ్డి, దొమ్మాటి కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

భవన నిర్మాణాలకు అనుమతులు ఇవ్వండి..

- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు
- మేడ్చల్ జిల్లా కలెక్టర్‌కు వినతి

మేడ్చల్- మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ పొట్రుకు వినతిపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, ఆయా కాలనీల అసోసియేషన్ నేతలు

కేపీహెచ్‌బీ కాలనీ, ఏప్రిల్ 2: కూకట్‌పల్లి మండలం, హైదర్‌నగర్ గ్రామ పరిధిలోని సర్వేనంబర్ 145, 163లలో భవన నిర్మాణాలకు అనుమతులు ఇవ్వాలని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు కోరారు. ఈ మేరకు బుధవారం బాధిత కాలనీల అసోసియేషన్ నేతలతో కలిసి ఆయన.. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ పొట్రును కలిసి సమస్యను వివరించి.. వినతి పత్రాన్ని అందజేశారు. కూకట్‌పల్లి మండల పరిధిలోని 145,163 సర్వే నంబర్లలో వసంత నగర్, సాయి నగర్, సర్దార్ పటేల్ నగర్, భగత్ సింగ్‌నగర్, సీబీసీఐడీ కాలనీ, ఎన్ఆర్ఎస్ఏ కాలనీ, ఎస్ఎస్ కాలనీలు ఏర్పడ్డాయన్నారు. 40 సంవత్సరాల క్రితమే లేఅవుట్ చేసి ఇళ్ల స్థలాలుగా అభివృద్ధి చేశారని అప్పటినుంచి గత మార్చి నెల వరకు గ్రామపంచాయతీలు మొదలుకొని జీహెచ్ఎంసీ వరకు భవన నిర్మాణాలకు అనుమతులు జారీ చేశారన్నారు. దీంతో ఈ కాలనీల్లో 50 వేలకు పైగా ఇండ్ల నిర్మాణం జరిగినట్లు తెలిపారు. గత నెలరోజుల కాలంగా ఆయా కాలనీల్లో ఇళ్ల నిర్మాణాల కోసం దరఖాస్తులు చేసుకుంటే జీహెచ్ ఎంసీ అధికారులు అనుమతులు ఇవ్వడం లేదన్నారు. భవన నిర్మాణ దరఖాస్తులను కలెక్టర్‌కు పంపుతున్నారన్నారు. అకస్మాత్తుగా అనుమతులు నిలిపివేయడంతో స్థానిక ప్రజలంతా ఇబ్బందులు పడుతున్నట్టు తెలిపారు. అనేక సంవత్సరాలుగా లేని సమస్యలు అకస్మాత్తుగా ఎలా వచ్చాయని ప్రశ్నించారు. సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ప్రజలకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, పలు కాలనీల అసోసియేషన్ నేతలు ఎర్ర నాగేశ్వరరావు, నాగిరెడ్డి, హనుమంతరావు, సాంబశివరావు, ప్రభాకర్, రామారావు, శిల్పా ప్రభాకర్, తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్సీ శంభీపూర్ రాజును కలిసిన ప్రజలు

ప్రజా సంక్షేమమే లక్ష్యం: ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు

దుండిగల్, ఏప్రిల్ 2: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్నామని ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఎమ్మెల్సీ, మేడ్చల్ జిల్లా బీ ఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు శంభీపూర్ రాజు అన్నారు. దుండిగల్ మున్సిపాలిటీ పరిధి, శంభీపూర్ లోని కార్యాలయంలో నియోజకవర్గానికి చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, వివిధ కాలనీల ప్రజలు బుధవారం ఆయనను కలిశారు. ఈ సందర్భంగా పలు సమస్యలు ఆయన దృష్టికి తీసుకెళ్లడంతో పాటు వాటిని పరిష్కరించాలని విన్నవించారు. ఇందుకు రాజు సానుకూలంగా స్పందించి.. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామని తెలిపారు. సంబంధిత అధికారులతో ఫోన్లో మాట్లాడి సమస్యలను పరిష్కరిస్తామన్నారు. అదేవిధంగా ఈ నెల 6న పలు ప్రాంతాల్లో జరగనున్న శ్రీ రామ నవమి ఉత్సవాల వేడుకల్లో పాల్గొనాలని పలువురు ఆహ్వాన పత్రికలను అందజేశారు.

'బీవీఆర్ఐటీ'లో సాంకేతిక సంస్కృతిక ఉత్సవం ..

సాంకేతిక ఉత్సవంలో విద్యార్థులు

దుండిగల్, ఏప్రిల్ 2: నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి, బాచుపల్లి, రాజీవ్ గాంధీనగర్ సమీపంలోని బీవీఆర్ఐటీ మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం సినర్జీయ-2025 పేరిట సాంకేతిక, సాంస్కృతిక ఉత్సవం ఘనంగా జరిగింది. వేడుకల్లో దేశవ్యాప్తంగా ఉన్న పలు మహిళా ఇంజినీరింగ్ కళాశాలలకు చెందిన సుమారు 500 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వేడుకకు వి ఎనే బుల్, వీ హబ్ డైరెక్టర్ విజయ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ.. మహిళా విద్యార్థుల ప్రతి సమస్యను ఒక అవకాశంగా తీసుకుని దానికి పరిష్కారాలు కనుగొనేందుకు కృషి చేయాలని సూచించారు. విద్యార్థులు సాంకేతికతను నేర్చుకుని తమకు తాము అభివృద్ధి చేసుకోవాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డా. కేవీఎన్ సునీత, సినర్జీయ-2025 కన్వీనర్ డా, మాలతి మాట్లాడుతూ.. ఇటువంటి సాంకేతిక సాంస్కృతిక ఉత్సవాల నిర్వహణతో విద్యార్థుల్లో పోటీ భావాన్ని పెంపొందించేందుకు తోడ్పాటును అందిస్తుందన్నారు. మొత్తం మూడు రోజులపాటు జరగనున్న వేడుకల్లో సుమారు 35 ఈవెంట్లు జరుగుతాయని తెలిపారు. ఇందులో రోబోటిక్స్, ఏఆర్అండ్ఈఆర్, త్రీడీ ప్రింటింగ్, లాట్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మిషన్ లెర్నింగ్ వంటి ఆధునిక సాంకేతిక రంగాలపై పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

కేపీహెచ్‌బీ కాలనీలో నివాసం ఉండే భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకుడు బందా విశ్వేశ్వరరావు మృతి చెందగా బుధవారం ఆయన పార్థివ దేహానికి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు నివాళులర్పించారు. అనంతరం అతని కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. – కేపీహెచ్‌బీ కాలనీ, ఏప్రిల్ 2

కొనసా...గుతున్న బ్రిడ్జి పనులు..

జగద్గిరిగుట్ట , ఏప్రిల్ 2: షాపూర్ నగర్ నుంచి జగదిరిగుట్ట వెళ్లే పైప్‌లైన్ రోడ్డులో రూ. కోటితో చేపట్టిన బ్రిడ్జి నిర్మాణ పనులు ఆరు నెలలుగా కొనసాగుతూనే ఉన్నాయి. ప్రత్యామ్నాయంగా ఏర్పాటు చేసిన దారి సరిగ్గాలేక వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అసలే మలుపులు రోడ్డు..ఆపై మధ్యలో విద్యుత్ స్తంభాలు అడ్డుగా ఉండ డంతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. పది రోజుల క్రితం కురిసిన చిన్నపాటి వర్షానికి రోడ్డంతా గోతులమయంగా మారింది. బ్రిడ్జి ప్రధాన నిర్మాణం పూర్తయినా అ ప్రోచ్ రోడ్డు సైడ్ వా ల్స్ నిర్మించాల్సి ఉంది. అది పూర్తి చేసి అం దుబాటులోకి తేవాలంటే మరో నెల రోజులు పట్టేలా కనిపిస్తోంది. అంతవరకు ప్రమాదాలు జరగకుండా ప్రత్యామ్నాయ రహదారిని చదును చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

శివాలయ పరిసరాల్లో రోడ్డు వేయాలి..

రోడ్డు వేయాలని కోరుతూ కార్పొరేటర్ సతీశ్‌గౌడ్‌కు వినతి పత్రం అందజేస్తున్న స్థానికులు

బాలానగర్, ఏప్రిల్ 2 : ఫతేనగర్ డివిజన్, శివాలయం పరిసరాల్లో రోడ్డు వేయాలని కోరుతూ స్థానికులు బుధవారం కార్పొరేటర్ పండాల సతీశ్‌గౌడ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. బుధవారం స్థానికుల కోరిక మేరకు శివాలయం రోడ్డులో కార్పొరేటర్ సతీశ్ గౌడ్ పర్యటించి సమస్యను పరిశీలించారు. ఈ సందర్భంగా రోడ్డు వేయాలని స్థానికులు కోరారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. స్థానికుల విజ్ఞప్తి మేరకు శివాలయ పరిసరాల్లో సరైన రోడ్డు మార్గం నిర్మించేందుకు కృషి చేస్తానన్నారు. గతంలోనే సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టి పూర్తి చేశామని, మిగిలిన పనులను త్వరలో చేపట్టి పూర్తి చేస్తామని పేర్కొన్నారు.

జేఎన్టీయూహెచ్ వర్సిటీ అడ్మిషన్స్ డైరెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన మెకానికల్ ఇంజినీరింగ్ విభాగం సీనియర్ ఆఫీసర్ బి.బాలు నాయక్‌కు... బుధవారం వర్సిటీ బంజారా విద్యార్థి సంఘం నాయకులు పుష్పగుచ్చానందించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘం నేతలు భాను ప్రకాశ్‌నాయక్, ఆకాశ్‌నాయక్, శశి కుమార్, రాహుల్, సురేశ్ కుమార్, సాయికిరణ్ , జగన్, తదితరులు పాల్గొన్నారు.

– కేపీహెచ్‌బీ కాలనీ, ఏప్రిల్ 2

కూకట్‌పల్లి కోర్టు బార్ అసోసియేషన్ కార్యవర్గం

కేపీహెచ్‌బీ కాలనీ, ఏప్రిల్ 2 : కూకట్‌పల్లి కోర్టు బార్ అసోసియేషన్ నూతన కమిటీ సభ్యులు ప్రమాణస్వీకారం చేశారు. ఈ మేరకు బుధవారం కోర్టు ప్రాంగణంలో జరిగిన సమావేశంలో అధ్యక్షుడిగా పి.గోవర్ధన్ రెడ్డి, ఉపాధ్యక్షుడిగా భీమయ్య, ప్రధాన కార్యదర్శిగా సుదర్శన్ రెడ్డి, సంయుక్త కార్యదర్శిగా హర్షవర్ధన్ రెడ్డి, కోశాధికారిగా సైపుల్ షరీఫ్, కార్యవర్గ సభ్యులుగా అఖిలారావు, సీహెచ్ అర్చ న గౌడ్, కళ్యాణి, తన్నీరు శ్రీకాంత్, రామకృష్ణ, పద్మావతి, భాను ప్రకాశ్‌లు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... కోర్టులో వసతులను మెరుగు పరుస్తామని, న్యాయవాదుల సంక్షేమానికి కృషి చేస్తామన్నారు. నమ్మకంతో గెలిపించిన సభ్యులందరికీ వారు కృతజ్ఞతలు తెలిపారు.

చలివేంద్రాలు ఏర్పాటు చేయడం అభినందనీయం

బాలానగర్, ఏప్రిల్ 2 : చలివేంద్రాలు బాటసారుల దాహార్తిని తీరుస్తాయని ఓల్డ్ బోయినపల్లి కార్పొరేటర్ ముద్దం నరసింహ యాదవ్ అన్నారు. బుధవారం డివిజన్ పరిధిలోని కళింగ ఎన్‌క్లేవ్‌లో స్కిన్ హెయిర్ క్లినిక్ ఎండి మాధవి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేసవి కాలం సందర్భంగా బాటసారుల సహాయార్థం చలివేంద్రాలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో టింకు గౌడ్, మనీశ్ చారి, కృష్ణచారి, వేణుగోపాల్, రాజు, లక్ష్మి, శ్రావణి పాల్గొన్నారు.

అనంతరం శ్రీ సాయి ఎన్‌క్లేవ్‌లో ఆయన పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ.. కాలనీలో డ్రైనేజీ క్లీనింగ్, ఓపెన్ నాలా క్యాచ్ బిట్స్ వేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. తాగునీటి సరఫరాలో పొల్యూషన్ సమస్య లేకుండా చూడాలని జలమండలి అధికారులకు సూచించారు. కార్యక్రమంలో శ్రీ సాయి ఎన్‌క్లేవ్ అధ్యక్షుడు సిద్ధిరామిరెడ్డి, మధుకర్ రెడ్డి, విశ్వనాథం, లింగం, దేవేందర్ రెడ్డి, లింగన్న పాల్గొన్నారు.

చలివేంద్రం, మజ్జిగ కేంద్రానికి ఆర్థిక సాయం..

బాటసారుల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు ఎంతగానో దోహదం చేస్తాయని సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు రాణా ప్రతాప్ అన్నారు. బుధవారం కేపీహెచ్బీ కాలనీ డివిజన్, వసంతనగర్ కాలనీ బస్టాప్‌లో వసంతనగర్ సొసైటీ, మహిళా మండలి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చలివేంద్రం, మజ్జిగ కేంద్రానికి సేవ్ ఏ లైఫ్ సేఫ్టీ ఫర్ హ్యూమానిటీ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు రాణా ప్రతాప్ ఆర్థిక సహాయాన్ని అందజేశారు. వేసవి కాలంలో ఎండ వేడిమి నుంచి ప్రతి ఒక్కరు సాధ్యమైనంత మేర తాగునీటి తీసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో బాల, సీత మనోహరి, సుబ్బారావు పాల్గొన్నారు. – కేపీహెచ్‌బీ కాలనీ, ఏప్రిల్ 2

శ్రీరామనవమి వేడుకలకు హాజరుకండి ..

బాలానగర్ డివిజన్ పరిధి వినాయకనగర్‌లో ఈనెల 6వ తేదీన నిర్వహించనున్న శ్రీరామనవమి వేడుకలకు హాజరుకావాలని కోరుతూ స్థానిక కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డికి కాలనీవాసులు విజ్ఞప్తి చేశారు. బుధవారం వినాయకనగర్‌లోని కార్పొరేటర్ కార్యాలయంలో ఆయనను కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ రవీందర్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ సంవత్సరం కూడా శ్రీరామ నవమి వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో కాలనీవాసులు, తదితరులు పాల్గొన్నారు. – బాలానగర్, ఏప్రిల్ 2

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మాదాపూర్, ఏప్రిల్ 2: ఫీడర్ మరమ్మతుల కారణంగా చందానగర్ సబ్ స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉం టుందని ఏఈ దీప్తి తెలిపారు. ఇందులో భాగంగా 11 కేవీ మార్తాండనగర్ ఫీడర్ పరిధిలో మార్తాండ నగర్, న్యూ హఫీజ్ పేట, హనీఫ్‌కాలనీ ప్రాంతాల్లో మధ్యాహ్నం 1:30 నుంచి 3:30 గంటల వరకు, 11కేవీ హఫీజ్‌పేట ఫీడర్ పరిధిలోని ప్రకాశ్‌నగర్, అక్షయ ఎలైట్ అపార్ట్‌మెంట్స్ ప్రాంతాల్లో మధ్యాహ్నం 3:30 నుండి 5:30 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనున్నట్లు తెలిపారు.

ఈద్ మిలాబ్ నిర్వహించడం అభినందనీయం

బాలానగర్, ఏప్రిల్ 2 : ఈద్ మిలాబ్ కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందనీయమని ఓల్డ్ బోయిన్‌పల్లి కార్పొరేటర్ ముద్దం నరసింహ యాదవ్ అన్నారు. బుధవారం డివిజన్ పరిధిలోని కళింగ ఎన్‌క్లేవ్‌లో ఖాజా కుష్బుద్దీన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈద్ మిలాబ్ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మైనార్టీలకు కార్పొరేటర్ శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో నాయకులు కర్రె జంగయ్య, హరి నాథ్, సయ్యద్ ఇజాజ్, ఉదయ్, ఖదీర్, యాదగిరి, మల్లేశ్ యాదవ్, సోఫీ, వాజిద్, మహేశ్ యాదవ్, మల్లికార్జున్ యాదవ్, శ్రీకాంత్ యాదవ్, వెంకట్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

మాదాపూర్, ఏప్రిల్ 2: గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన సంఘటన బుధవారం మాదాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మా హైటెక్ సిటీ పవర్ టవర్ ఎదురుగా ఫ్లై ఓవర్ కింద గుర్తు తెలియని మృతదేహాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించా డగా మృతి చెందినట్లు గుర్తించారు. పోలీసులు మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రేషన్ దుకాణాల సంఖ్య పెంచండి ..



అడిషనల్ కలెక్టర్ ప్రతిమ సింగ్, అధికారులు, కార్పొరేటర్లతో కలిసి సన్నబియ్యం పంపిణీ చేస్తున్న పీఏసీ చైర్మన్ గాంధీ

మియాపూర్, ఏప్రిల్ 2: దేశంలోని అతి పెద్దదైన శేరిలింగంపల్లి నియోజకవర్గంలో నిరుపేద లబ్ధిదారుల సంఖ్యకు అనుగుణంగా రేషన్ దుకాణాలు లేవని పీఏసీ చైర్మన్ అరికపూడి గాంధీ అన్నారు. పేద ప్రజలకు సులువుగా నిత్యావసర సరుకులు అందేలా రేషన్ దుకాణాల సంఖ్యను పెంచాలని ఆయన అధికారులను కోరారు. సన్న బియ్యం పంపిణీ కార్యక్రమంలో భాగంగా బుధవారం చందానగర్ సర్కిల్ కార్యాలయ ఆవరణలోని అంబేద్కర్ కల్యాణ మంటపల్లి రేషన్ దుకాణంలో రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్, ఓబీసీ చైర్మన్ జైపాల్, కార్పొరేటర్లు , అధికారులతో కలిసి ఆయన లబ్ధిదారులకు సన్న బియ్యం పంపిణీ చేశారు .ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ .. నియోజకవర్గ వ్యాప్తం గా 80 రేషన్ దుకాణాలు ఉండగా శేరిలింగంపల్లి మండలంలో 57 మాత్రమే ఉన్నాయని, లక్షలాదిగా ఉన్న లబ్ధిదారులకు నిత్యావసర సరుకులను అందించేందుకు వీటి సంఖ్య సరిపోవడం లేదని, వాటిని పెంచాలని కోరారు. శేరిలింగంపల్లి మం డల పరిధిలోని గోపన్నపల్లి తండాలో లబ్ధిదారుల సంఖ్య అధికంగా ఉండగా, దూరప్రాంతమైన నానక్‌రాంగూడ వెళ్లి నిత్యావసర సరుకులను తీసుకోవాల్సి వస్తుందని, ఇది పేద ప్రజలకు ఎంతో అసౌకర్యంగా ఉందని గాంధీ పేర్కొన్నారు. ఒక్కో రేషన్ డీలర్ నాలుగైదు రేషన్ దుకాణాలను నడిపిస్తున్నారని, దీనివల్ల పేద ప్రజలకు సరుకుల పంపిణీ కొంత ఇబ్బందికరంగా మారుతోందని అన్నారు. సరుకులు తీసుకున్న పేద ప్రజల పట్ల అగౌరవంగా మాట్లాడడం, వ్యవహరించడం చేయవద్దని రేషన్ డీలర్లను ఆయన హెచ్చరించారు . రేషన్ దుకాణాల్లో నిత్యావసర సరుకుల పంపిణీపై అధికారులు పకడ్బందీగా పర్యవేక్షణ చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు మంజుల రఘునాథరెడ్డి, ఉప్పలపాటి శ్రీకాంత్, నార్ని శ్రీనివాస్, దొడ్ల వెంకటేశ్ గౌడ్, ఉప కమిషనర్ మోహన్ రెడ్డి, జిల్లా సివిల్ సప్లయ్ అధికారి శ్రీనివాస్ ఇతర ప్రతినిధులు పార్టీ నేతలు పాల్గొన్నారు. కాగా.. చందానగర్ సర్కిల్ ఉప కమిషనర్ ప్రోటోకాల్ సరిగ్గా పాటించడం లేదని, తమ మాటకు ఏ మాత్రం విలువ ఇవ్వడం లేదని చందానగర్ కార్పొరేటర్ మంజుల రఘునాథరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశా రు. సన్నబియ్యం పంపిణీ అనంతరం సమావేశ మందిరం నుంచి బ యటికి వచ్చిన ఎమ్మెల్యే గాంధీ సమక్షంలో కార్పొరేటర్ ఇతర పార్టీ నేతలు డీసీ తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

మతిస్థిమితం లేని వృద్ధురాలు అదృశ్యం

దానమ్మ (ఫైల్)

దుండిగల్, ఏప్రిల్ 2: మతిస్థిమితంతో బాధపడుతున్న ఓ వృద్ధురాలు అదృశ్యమైన సంఘటన సూరారం పోలీస్ స్టేషన్ పరిధిలో వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... గాజులరామారం సర్కిల్, సూరారం డివిజన్ పరిధిలోని స్కం దానగర్‌లో చేజర్ల శ్రీను నివా సంఉంటున్నాడు. శ్రీను తన భార్యా పిల్లలతో కలిసి ఇంట్లోని ఫస్ట్ ఫ్లోర్‌లో వాసం ఉంటుండగా తల్లి దానమ్మ గ్రౌండ్‌ఫ్లోర్‌లో ఉం టుంది. ఈ నేపథ్యంలో బుధవారం సా యంత్రం దానమ్మ ఇంట్లో లేకపోవడం తో శ్రీను .. పరిసర ప్రాంతాల్లో, బం ధు వుల వద్ద ఆరా తీసినా ఆచూకీ లభించ లే దు. దీంతో బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నిజాంపేట్ టౌన్ ప్లానింగ్‌లో అయోమయం..!

పూర్తిస్థాయిలో లేని ఏసీపీ, టీపీఎస్ అధికారులు

అక్రమార్కులకు వరంగా మారిన వైనం

దుండిగల్, ఏప్రిల్ 2: నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో పట్టణ ప్రణాళిక (టౌన్ ప్లానింగ్) విభాగం అయోమయంగా మారింది. ఇక్కడ రెగ్యులర్‌గా పనిచేసే అసిస్టెంట్ సిటీ ప్లానర్ (ఏసీపీ), టౌన్ ప్లానింగ్ సెక్షన్ అధికారి (టీపీఎస్) లేకపోవడం అక్రమార్కులకు వరంగా మారింది. దీంతో మున్సిపల్ కార్పొరేషన్ ఉన్నతాధికారులు పూర్తిగా టౌన్ ప్లానింగ్ చైన్‌మెన్‌ల పైనే ఆధార పడాల్సిన పరిస్థితి దాపురించింది. ఇటీవల వారం రోజుల క్రితం మున్సిపల్ కమిషనర్ కాంట్రాక్టు ప్రాతిపదికన టౌన్‌ప్లానింగ్‌లో చైన్‌మెన్‌లుగా పని చేస్తున్న సిబ్బందిని తొలగించి, వారి స్థానంలో వార్డు అధికారులుగా పని చేస్తున్న గ్రూప్-4 అధికారులను నియమించారు. కొత్తగా బాధ్యతలు చేపట్టిన గ్రూప్ -4 ఉద్యోగులకు టౌన్ ప్లానింగ్ విభాగంపై అవగాహన లేకపోవడం, పాతవారిని విధుల నుంచి తప్పించడంతో నిజాంపేట్ కార్పొరేషన్‌లో టౌన్ ప్లానింగ్ వ్యవస్థ ఎటు కాకుండా పూర్తిగా నిర్వీర్యమైంది. వారంలో మూడు రోజులపాటు అందుబాటులో ఉండే అసిస్టెంట్ సిటీ ప్లానర్ (ఏసీపీ), ఆ తర్వాత మూడు రోజులపాటు అందుబాటులో ఉండే టీపీఎస్ సైతం ఇతర ప్రాంతాల్లో పనిచేస్తుండడంతో వారు సరిగ్గా అందుబాటులో ఉండకపోవడంతో టౌన్ ప్లానింగ్ లో బాధ్యత కలిగిన అధికారులు లేకపోవడంతో శూన్యత ఏర్పడినట్లు అయింది. దీంతో భవన నిర్మాణ అనుమతుల కోసం వచ్చిన దరఖాస్తులన్నీ కుప్పలుగా పెండింగ్‌లో ఉండాల్సిన పరిస్థితి దాపురించింది. దీంతో భవన నిర్మాణాల అనుమతుల కోసం నిర్మాణదారులు ప్రతినిత్యం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం చుట్టూ చెప్పులు అరిగేలా తిరగాల్సి వస్తుంది అంటున్నారు. కార్పొరేషన్ కమిషనర్ సైతం తాను ఒక్కడినే ఏం చేయగలననే ఆసహాయతను వ్యక్తం చేయడం గమనార్హం. ప్రస్తుతం పని చేస్తున్న ఏసీపీ, టీపీఎస్ ల స్థానంలో కొత్తవారిని తీసుకునేందుకు ప్రయత్నిస్తున్నానని కమిషనర్ పేర్కొంటుండగా దరఖాస్తుదారులు మాత్రం అసహనం వ్యక్తం చేస్తున్నారు.

ఇష్టారాజ్యంగా నిర్మాణదారులు...!

నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో టౌన్ ప్లానింగ్ విభాగం పూర్తిగా నిర్వీర్యంగా మారడంతో నిర్మాణదారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. కొందరు నిర్మాణదారులు తమ భవనాలకు సంబంధించి స్టిల్ట్ 2 అనుమతులు మాత్రమే పొంది.. 5,6 అంతస్తుల వరకు నిర్మిస్తున్నారు. ఇంకొందరు మున్సిపాలిటీ నుంచి ఎటువంటి అనుమతులు పొందకుండానే షెడ్లు, స్విమ్మింగ్ పూల్స్ నిర్మిస్తున్నారు. ఇక హెచ్ఎండీఏ నుంచి అనుమతులు పొంది నిర్మాణం పూర్తయిన అనంతరం ఆక్యుపేషన్ సర్టిఫికెట్స్ (ఓసీ) లు పొందిన భవన యజమానులు తదనంతరం భవనాలను మరింత విస్తరిస్తూ నిర్మాణాలు చేపడుతున్నారు. వాటిని పర్యవేక్షించి, నిలువరించాల్సిన నిజాంపేట్ టౌన్ ప్లానింగ్ ఆ చేతనంగా మారడంతో ఇబ్బడి ముబ్బడిగా అక్రమ నిర్మాణాలు చోటుచేసుకుంటున్నాయి. ఇలా మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని నిజాంపేట, బాచుపల్లి, ప్రతి నగర్‌లలో నిబంధనలకు విరుద్ధంగా పదులకొద్దీ నిర్మాణాలు వెలుస్తున్నా పట్టించుకునే నాథుడే లేదంటే అతిశయోక్తి కాదేమో అంటున్నారు స్థానికులు. ఏదేమైనా ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతూ, నిబంధనలకు విరుద్ధంగా చేపడుతున్న నిర్మాణాలను నిలువరించాల్సిన అవసరం మున్సిపల్ కార్పొరేషన్ అధికారులపై ఉందని స్థానికుల అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికైనా నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు అక్రమ నిర్మాణాలపై చర్యలకు ఉపక్రమిస్తారో లేదో..చూద్దాం..!

కూకట్‌పల్లి రైతు బజార్ కూరగాయల ధరలు..

కేపీహెచ్‌బీ కాలనీ, ఏప్రిల్ 2 : కూకట్‌పల్లి (కేపీహెచ్‌బీ కాలనీ) రైతుబజార్‌లో బుధవారం కూరగాయల ధరలు (క